క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అమరావతి: తాడికొండ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ నూతన లైన్ల నిర్మాణం కారణంగా గురువారం మండల పరిధిలోని అన్ని గ్రామాలలో విద్యుత్ సరఫరాకు ఆటంకం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ అశోక్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాలలో మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పేదల కలను సాకారం చేసిన సీఎం జగన్



సత్తెనపల్లి: నిరుపేదల ఇంటికలను సాకారం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పంచుమర్తి అప్పారావు అన్నారు. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లులో భాగంగా సత్తెనపల్లి మండలం పణిదం గ్రామంలో బుధవారం గ్రామంలోని 78 మంది మహిళలకు, దీపాలదిన్నెపాలెం గ్రామానికి చెందిన 11 మందికి ఇళ్ల స్థలాలపై సంపూర్ణ హక్కులు కల్పించిన రిజిస్ట్రేషన్ పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఎంసీ మాజీ చైర్మన్ అప్పారావు మాట్లాడుతూ నిరుపేదలకు ఇచ్చిన ఇంటి స్థలాలను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి సంపూర్ణ హక్కులు ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ఈ ప్రక్రియ గ్రామ సచివాలయాల్లో వేగంగా సాగుతుందని, పట్టాలు పొందిన వారంతా మహిళలు కాగా వారంతా ఇప్పుడు లక్షాధికారులు అయ్యారన్నారు. ఏళ్లుగా నిలువ నీడ లేక ఇబ్బందులు పడిన వారంతా లక్షల విలువైన స్థలంపై సీఎం జగన్‌మోహన్ రెడ్డి సంపూర్ణ హక్కులు కల్పించడంతో ఆనందోత్సాహాల్లో మునిగిపోయారన్నారు. సర్పంచ్ వేమవరపు బుల్లిబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వాలకు పూర్తి భిన్నంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేయడమే కాక ఆ స్థలాలపై సంపూర్ణ హక్కులు కలిగేలా రిజిస్ట్రేషన్ చేసి పట్టాలు అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా తెనాలిలో ఇంటి పట్టా పొందిన ఆనందంలో ఉన్న గీతాంజలి అనే మహిళ టీడీపీ, జనసేన సోషల్ మీడియా వికృత చేష్టలకు బలైపోవడాన్ని నిరసిస్తూ మౌనం పాటించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు సుంకర ఇనన్నమ్మ, పల్లెపోగు రాహేలమ్మ, పంచాయతీ కార్యదర్శి వీరాంజనేయులు, గ్రామ పెద్దలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ

అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అమరావతి కృష్ణానది తీరంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం గుర్తుతెలియని దుండగులు స్వామివారి వెండి కిరీటం చోరీ చేసిన ఘటన చోటు చేసుకుంది. పోలీసుల అందించిన సమాచారం మేరకు మంగళవారం మధ్యాహ్నం ఆలయ అర్చకుడు ఆలయం గ్రిల్స్‌కు మాత్రమే తాళం వేసి వెళ్లటం జరిగింది. అనంతరం గుర్తుతెలియని దుండగులు గ్రిల్స్‌లో నుంచి సుమారు రూ.35 వేల విలువైన 350 గ్రాముల స్వామివారి వెండి కిరీటాన్ని లాగి చోరీ చేశారు. సాయంత్రం అర్చకుడు కిరీటం చోరీకి గురయినట్లు గుర్తించి అమరావతి పోలీసులకు సమాచారం ఇవ్వటంతో సీఐ బ్రహ్మం ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఘటన స్థలాన్ని పరిశీలించారు. బుధవారం ఆలయ ధర్మకర్త దీక్షితులు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా దేవాలయంలో సీసీ కెమెరా పుటేజీ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

శ్మశాన వాటికల అభివృద్ధి పనులు ప్రారంభం

అమరావతి: మండల పరిధిలోని లేమల్లె గ్రామంలో హిందూ శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణాన్ని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు బుధవారం ప్రారంభించారు. అలాగే బీసీ శ్మశాన వాటిక ప్రహరీ గోడ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉగ్గం పున్నమ్మ, ఎంపీటీసీ నాగులమీరావలి, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉగ్గం యలమందయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలలో పారిశుధ్యంపై దృష్టి సారించండి

అమరావతి: మండల పరిధిలోని గ్రామాలలో ప్రజలకు తాగునీరు అందించటానికి, అంటు వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యం మెరుగుపరచటానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ మేకల హనుమంతరావు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మేకల హనుమంతరావు మాట్లాడుతూ మండల పరిషత్ నిధులతో గ్రామాలలో అభివృద్ధి పనులు చేయటం జరిగిందన్నారు. సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు, గ్రావెల్ రోడ్లు, కమ్యూనిటీ హాల్స్ నిర్మించామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సహకారంతో మండల సర్వతోముఖాభివృద్ధికి మండల ప్రజాపరిషత్ కృషి చేస్తుందన్నారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మంగిశెట్టి కోటేశ్వరరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు మంగిశెట్టి శ్రీనివాసరావు, ఎంపీడీవో జి.రాణి, ఈవోపీఆర్డీ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

తొలి తెలుగు మహిళా కవయిత్రి మొల్ల



మొల్ల విగ్రహానికి పూలమాలలు వేస్తున్న బీసీ సంఘాల నాయకులు



12వ సచివాలయంలో మొల్ల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఘనంగా కవయిత్రి మొల్ల జయంతి వేడుకలు

సత్తెనపల్లి: బీసీ సంఘాల ఆధ్వర్యంలో తొలి తెలుగు మహిళా కవయిత్రి మొల్ల జయంతి వేడుకలు సత్తెనపల్లి పట్టణంలోని రైల్వేగేట్ దగ్గర మొల్ల విగ్రహం వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ కుమ్మర్ల ఆరాధ్య దేవతగా పిలువబడే మొల్ల జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు. సంస్కృతంలో ఉన్న రామాయణాన్ని కేవలం ఐదు రోజుల్లో తెలుగులోకి అనువదించిన గొప్ప కవయిత్రి అని కొనియాడారు. ఆమె తిక్కన, సోమయాజికీ, భాస్కరునికీ, ప్రతాపరుద్రునికీ సమకాలీకురాలిగా చెప్పుకుంటారన్నారు. కులాన్ని బట్టి కుమ్మరి మొల్ల అని వ్యవహరించబడుచుందన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు కుమ్మరి దస్తగిరి, గుంటూరు గోవింద్, షేక్ చిన్న షరీఫ్, పత్తిపాటి హరికృష్ణ, క్యాలిబర్ జానీ, గొట్టం వెంకటేష్, గొట్టిముక్కల భూపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

17వ వార్డులో..

పట్టణంలోని 17వ వార్డు కౌన్సిలర్ సెగ్గెం పద్మావతి, వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో 12వ సచివాలయంలో కవయిత్రి మొల్ల జయంతి ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగులో రామాయణం రచించిన తొలి తెలుగు కవయిత్రి మొల్ల అని పలువురు కొనియాడారు. ఆమెను ఆదర్శంగా తీసుకొని మహిళలందరూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. సచివాలయ మహిళా సిబ్బందిని సత్కరించారు. కవయత్రి మొల్ల జయంతిని రాష్ట్ర ఉత్సవంగా నిర్వహిస్తున్నందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ముందుగా మొల్ల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు తోట వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిపై అవగాహన కలిగి ఉండాలి

- సత్తెనపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి మురళీకృష్ణ
- నియోజకవర్గ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం



మాట్లాడుతున్న ఆర్డీ మురళీకృష్ణ

సత్తెనపల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన నియమావళిపై రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సత్తెనపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి వి.మురళీకృష్ణ చెప్పారు. పట్టణంలోని తన కార్యాలయంలో బుధవారం నియోజకవర్గంలోని వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయ్యాక నామినేషన్‌ల దాఖలు, వాటి పరిశీలన, గడువు, ప్రచారంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నియమ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, ర్యాంప్‌లు, రెయిలింగ్ వంటి మౌలిక వసతులను కల్పిస్తున్నామన్నారు. 40 శాతం వైకల్యం దాటి ఉన్నవారికి, 85 ఏళ్లు పైబడిన వారికి ఇంటి నుంచే వారి అభీష్టం మేరకే ఓటు వేసుకునే అవకాశం ఉందన్నారు. దీనికి ముందస్తుగా 12–డీ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తే సి విజిల్ యాప్ ద్వారా ఫొటోలు తీసి పంపితే ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచి చర్యలు తీసుకుంటామన్నారు. సువిధ పోర్టల్, తదితర యాప్ నుంచి నామినేషన్ పత్రాలను నిర్ణీత తేదీల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం మూడులోగా ఆన్‌లైన్‌లో దాఖలు చేయవచ్చన్నారు. ఈ సందర్భంగా మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, తహసీల్దార్లు సీహెచ్ ఉష (సత్తెనపల్లి), పి.సింగారావు (ముప్పాళ్ళ), ఎం.హరిబాబు (రాజుపాలెం), ఎస్.లక్ష్మీనారాయణ (నకరికల్లు), ఎన్నికల విభాగం సీనియర్ అసిస్టెంట్ బోస్‌బాబు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకోండి



పెదకూరపాడులో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

పెదకూరపాడు: గ్రామాల్లో వివాదాలు వీడి... ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సీఐ మంగరావు అన్నారు. పెదకూరపాడు మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన పెదకూరపాడు, లింగంగుంట్ల గ్రామాల్లో బుధవారం సాయంత్రం బీఎస్ఎఫ్ సిబ్బందితో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా మంగరావు మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించినట్లు తెలిపారు. ఎన్నికల్లో ప్రజలు స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ప్రజలకు పూర్తి రక్షణ కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు వెంకట్రావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పేదల పెన్నిధి మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి



మండలంలోని శివాపురంతండాలో మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహావిష్కరణ

నకరికల్లు: పేద, బడుగు, బలహీనవర్గాలు, రైతుల కోసం సంక్షేమ పథకాలు రూపొందించి వాటిని అమలు చేసిన మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి అన్నారు. మండలంలోని శివాపురంతండాలో మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడం, సుభిక్షపాలన చేయడం మహానేత నైజం అన్నారు. మహానేత అడుగుజాడల్లో యువ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రిగా ప్రజల విశ్వాసం పొందారన్నారు. శివాపురంతండాలోని గిరిజనులకు అటవీభూముల హక్కు పత్రాల పంపిణీ, ఇంటింటికి తాగునీటి కుళాయిలు, అంతర్గత రోడ్ల నిర్మాణం లాంటి కార్యక్రమాలు చేపట్టి తండా అభివృద్ధికి కృషి చేయడంతో పాటు పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించారని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వాంకడావత్ ధ్వాళీబాయి, వైస్ ఎంపీపీలు మేడం ప్రవీణ్‌కుమార్ రెడ్డి, దూదేకుల హుస్సేన్‌బీ, బాషా, యూత్ కమిటీ అధ్యక్షుడు గుత్తికొండ నన్నేసా, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ లాల్‌బాషా, వాంకడావత్ సక్రూనాయక్, జబ్బార్‌నాయక్, మునిసింగ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లీజ్ ... పల్నాడు ఆపండి

- గుంటూరు డీఆర్ఎం రామకృష్ణకు వినతి
- రైల్వే స్టేషన్‌ను పరిశీలించిన డీఆర్ఎం

పెదకూరపాడు: సార్ ఫ్లీజ్ పెదకూరపాడులో పల్నాడు ఎక్స్‌ప్రెస్ (12747–78) హాల్ట్ కల్పించాలని పెదకూరపాడు పరిసర ప్రాంత ప్రయాణికులు గుంటూరు డీఆర్ఎం రామకృష్ణకు బుధవారం వినతి పత్రం అందించారు. పెదకూరపాడు నియోజకవర్గంలో అమరావతి, పెదకూరపాడు, అచ్చంపేట, క్రోసూరు మండలాల నుంచి ప్రతి రోజు 200 మందికి పైగా హైదరాబాద్‌కు పల్నాడు ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణం చేస్తున్నారని, ప్రతి రోజు తెల్లవారుజామున 4 గంటలకు ద్విచక్ర వాహనాలపై 17 కిలోమీటర్లు సత్తెనపల్లి వెళ్లి పల్నాడు ఎక్స్‌ప్రెస్ ఎక్కుతున్నామని, పెదకూరపాడులో హాల్ట్ కలిప్తే ప్రయాణ భారం తగ్గుతుందని విన్నవించారు. గత 15 సంవత్సరాలుగా అనేక పర్యాయాలు విన్నవించినా పట్టించుకోవడం లేదని హాల్ట్ కల్పించాలని కోరారు. అంతకు ముందు పెదకూరపాడు రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. రికార్డులు పరిశీలించారు. సమస్యలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

16వ శతాబ్దం నాటి శిలా శాసనం లభ్యం



నకరికల్లు: మండలంలోని రూపెనగుంట్ల గ్రామంలో వేంచేసి ఉన్న వీరాంజనేయ స్వామి ఆలయంలో 16వ శతాబ్దం నాటి శిలా శాసనం గుర్తించారు. స్వామి వారి పాదాల వద్ద ప్రతిష్టించి ఉన్న శాసనాన్ని ఆలయ అర్చకులు నారాయణం కృష్ణమాచార్యులు బుధవారం గుర్తించారు. స్వామివారి మూలవిరాట్ పాదభాగంలో శాసనం చెక్కించబడి ఉన్నట్లు అర్చకులు తెలిపారు. విషయాన్ని ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఏఎస్ఐ, శాసన పరిశోధకులు తురిమెళ్ల శ్రీనివాసప్రసాద్, శాసన విభాగం మైసూరు ప్రాంత డైరెక్టర్ కె.మునిరత్నం రెడ్డిలకు తెలిపారు. పరిశోధన చేసిన ఆర్కియాలజీ అధికారులు శాసనం వివరాలు అందజేశారు. శాలివాహన శకం 1512వ సంవత్సరం వికృతి నామ సంవత్సర బహుళ ఏకాదశి నాడు భరద్వాజ గోత్రానికి చెందిన కొత్తపల్లి రాఘవయ్య కుమారుడు తిమ్మాజీ హనుమంతుడిని ప్రతిష్ఠించినట్లు శాసనంలో చెక్కబడి ఉందన్నారు. క్యాలెండర్ ప్రకారం క్రీస్తు శకం 1590వ సంవత్సరం ఏప్రిల్ 20వ తేదీగా గుర్తించారు. మరిన్ని వివరాలు త్వరలో అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

మాతాశిశు సంరక్షణే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వం



పట్టణంలోని 3వ వార్డులో పోషణ్ పక్వాడాలో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారిణులు



పౌష్టికాహారం ప్రాముఖ్యతను వివరిస్తున్న సీడీపీఓ శ్రీలత, ఏసీడీపీఓ, సూపర్‌వైజర్‌లు

సత్తెనపల్లి: మాతా శిశు సంరక్షణ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని సత్తెనపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ టీ శ్రీలత అన్నారు. పోషణ్ పక్వాడాలో భాగంగా పట్టణంలోని మూడో వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం నిర్వహించిన పౌష్టికాహార పక్షోత్సవాల్లో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు గర్భం దాల్చినప్పటి నుంచి మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. హిమోగ్లోబిన్ సరిపడా ఉంటే ప్రసవ సమయంలో ఎటువంటి ఇబ్బంది ఉండదన్నారు. దీని కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం నెలకు సరిపడా వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను సైతం అందిస్తుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం సరఫరా చేయడం జరుగుతుందన్నారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ సంతోషకుమారి, సూపర్‌వైజర్ ప్రమీల, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెరికపాడు(క్రోసూరు): మండలంలోని పెరికపాడు తండా అంగన్‌వాడీ సెంటర్లో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ దొడ్లేరు సెక్టార్ సూపర్‌వైజర్ బీ రత్నకుమారి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పోషకాహారం తప్పకుండా తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. తల్లులకు వంటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. చిరుధాన్యాలు, ఆకుకూరలను ఉపయోగించి పోషకాహారం ఏ విధంగా తయారు చేయవచ్చునో వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య విస్తరణ అధికారి శిఖాశాంసన్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ షేక్ అమీర్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

నకరికల్లు: పౌష్టికాహారంతో తల్లి, బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీలత అన్నారు. మండలంలోని కండ్లకుంట గ్రామంలో పోషణ్ పక్వాడా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. పోషణ్ పక్వాడా చిత్రాన్ని గీసి వాటి ప్రయోజనాలను వివరించారు. గర్భిణులు, బాలింతలకు నిర్వహించిన అవగాహన సదస్సులో సీడీపీఓ శ్రీలత మాట్లాడుతూ గర్భం దాల్చిన నాటి నుంచి అన్ని పోషక విలువలు సమపాళ్లలో కలిగిన పౌష్టికాహారం తీసుకోవాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో క్రమం తప్పకుండా అందజేసే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ సంతోష కుమారి సూపర్‌వైజర్ ఆనందకుమారి, గ్రామ కార్యదర్శి సత్యనారాయణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రెండు గ్రామాలలో పోషణ్ పక్వాడా

అమరావతి: మండల పరిధిలోని రెండు గ్రామాలలో క్రోసూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బుధవారం పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ షేక్ ఇమాంబి మాట్లాడుతూ చిరుధాన్యాలలో ఉండే పోషక విలువలను వివరించారు. మండలంలోని పెదమద్దూరు, ఉంగుటూరు గ్రామాలలో మహిళాపోలీస్‌లు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు, తల్లులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరుని కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలి

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



విఘ్నేశ్వరుని పూజాకార్యక్రమాలలో ఎమ్మెల్యే

అచ్చంపేట: విఘ్నేశ్వరుని కృపాకటాక్షాలు నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని, అందరూ సుఖశాంతలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కోరారు. మండలంలోని చామర్రులో గత రెండు రోజులుగా జరుగుతున్న వరసిద్ధి వినాయక, నాభిశిల, భద్రకాళీ సమేత వీరభద్రస్వామి, అభయాంజనేయస్వామి, పోలేరమ్మతల్లి దేవాలయాల వార్షిక బ్రహ్మోత్సవాలలో చివరిరోజు బుధవారం ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. చామర్రు రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షులు ఉప్పల శ్రీనివాసమూర్తి, ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యే శంకరరావుకు పూర్ణకుంభంతో ఆహ్వానం పలికారు. శ్రీ సిద్ధిబుద్ధి సమేత వినాయక స్వామివారి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలను తిలకించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన వెంట ఎంపీటీసీ తెల్లమేకల నాగరాజు, అచ్చంపేట మాజీ సర్పంచ్ కంబాల వీరబాబు, తిరుపతయ్య తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీ చించివేతపై ఫిర్యాదు



దుండగులు చించివేసిన ఫ్లెక్సీ

ముప్పాళ్ళ: మండల కేంద్రం ముప్పాళ్ళలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో వైఎస్సార్‌సీపీ అభిమానులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని గుర్తు తెలియని వ్యక్తులు చించివేసిన ఘటన జరిగింది. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు మంగళవారం రాత్రి గ్రామంలో ముస్లింల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు అభిమానంతో నేతలకు స్వాగతం పలుకుతూ రోడ్డు వెంబడి ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అందులో భాగంగా పోలీస్‌స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని చించివేశారు. గ్రామంలో వైఎస్సార్‌సీపీ పట్ల ఆదరణను జీర్ణించుకోలేని వ్యక్తులే ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. జరిగిన ఘటనపై వైఎస్సార్‌సీపీ నాయకులు ఖాశిం, హుస్సేన్‌లు ముప్పాళ్ళ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఘటనా స్థలాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు పరిశీలించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



మహిళ కుటుంబ సభ్యులకు సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే నంబూరు

అచ్చంపేట: మండలంలోని ఓర్వకల్లు గ్రామానికి చెందిన కొలకలూరి సువార్త వెన్నుపూస వ్యాధితో తీవ్రంగా బాధపడగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆపరేషన్‌కు అయ్యే రూ.5 లక్షల చెక్కును సీఎం సహాయ నిధి నుంచి బుధవారం క్రోసూరు పార్టీ కార్యాలయంలో బాధిత కుటుంబానికి అందజేశారు. కొలకలూరి సువార్త వెన్నుపూస వ్యాధి భరించలేక తల్లడిల్లే పరిస్థితులలో భర్త నాగేశ్వరరావు భరించు తెలుగు రాష్ట్రాలలోని వైద్యశాలలు తిరిగారు. హైదరాబాదులోని ఓ ప్రయివేటు వైద్యశాలలో వ్యాధి నయం కావడం కష్టమని, వెంటనే ఆపరేషన్ చేయాల్సి ఉంటుందని అందుకు రూ.5లక్షలు ఖర్చు అవుతుందని చెప్పారు. వాస్తవంగా ఆ వ్యాధికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం రూ.2.50 లక్షల కన్నా ఎక్కువ వచ్చే అవకాశం లేదు. ఎమ్మెల్యే శంకరరావు బాధితురాలిని కాపాడలన్న తపనతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆపరేషన్‌కు అవసరమయ్యే రూ.5 లక్షలను కేవలం ఆరు గంటల వ్యవధిలో మంజూరు చేయించి అందజేశారు. ఇందుకు జీవితాంతం తాము సీఎం జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే శంకరరావుకు రుణపడి ఉంటామని బాధిత మహిళ కుటుంబసభ్యులు తెలిపారు.

లబ్ధిదారులకు శాశ్వత హక్కు పత్రాలు పంపిణీ



అచ్చంపేటలో శాశ్వత హక్కు పత్రాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ జాని

అచ్చంపేట: అచ్చంపేట జగనన్న కాలనీలో ఇంటి స్థలాలు పొందిన లబ్ధిదారులందరికీ ప్రభుత్వమే రిజిస్ట్రేషన్ చేయించి శాశ్వత హక్కు పత్రాలను మంజూరు చేసింది. స్థానిక పంచాయతీ కార్యాలయంలో లబ్ధిదారులకు బుధవారం సర్పంచ్ షేక్ జానీ శాశ్వత హక్కు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెదకూరపాడు నియోజకవర్గంలోనే అచ్చంపేట జగనన్న కాలనీ అతి పెద్దదన్నారు. గ్రామంలో 40 సంవత్సరాల క్రితం ఇంటి స్థల పట్టాలు ఇచ్చారని, వాటిని ఇంతవరకు అభివృద్ధి చేయలేదన్నారు. జగనన్న సీఎం కాగానే ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కులమతాలకు, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా మండలంలో 3 వేలకు పైగా లబ్ధిదారులకు స్థలాలు మంజూరు చేశారన్నారు. అచ్చంపేటలో 20 ఎకరాలకుపైగా భూమిని సేకరించి అందులో 700పైగా ప్లాట్లు వేసి సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. వాటిలో 200పైగా లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకుని నివాసముంటున్నారని, మరికొంత మంది ఇళ్ల నిర్మాణ దశలో ఉన్నాయని చెప్పారు. స్థలాలు పొందిన ప్రతి లబ్ధిదారు పేరుపై ప్రభుత్వమే రిజిస్ట్రేషన్ చేయించి శాశ్వత హక్కు కల్పించడం చరిత్రలో లేదన్నారు. అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో సీఎం జగన్, ఎమ్మెల్యే చేసి చూపించారని చెప్పారు.

వ్యాధుల నిర్ధారణలో ల్యాబ్ టెక్నీషియన్‌ల పాత్ర కీలకం



ల్యాబ్ టెక్నీషియన్లతో కొత్త రామకృష్ణ, సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు

సత్తెనపల్లి: వ్యాధి నిర్ధారణలో ల్యాబ్ టెక్నీషియన్‌ల పాత్ర ఎంతో కీలకమైందని ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ అన్నారు. పట్టణంలోని ఏరియా వైద్యశాలలో వైద్యశాల అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ల్యాబ్ టెక్నీషియన్స్ డే బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి ల్యాబ్ టెక్నీషియన్స్‌గా పని చేస్తున్న వారందరికీ చిరు సత్కారం చేశారు. రామకృష్ణ మాట్లాడుతూ ఏరియా వైద్యశాలలో నెలకి 75 వేల టెస్టుల దాకా చేస్తున్నారని, వారి సమయానికి మించి తమ బాధ్యత నిర్వర్తిస్తున్నారన్నారు. అలాంటి వారి శ్రమని గుర్తించడం తమ బాధ్యత అన్నారు. అత్యున్నతమైన ప్రమాణాలతో టెస్టులు నిర్వహించి, పేదలకు ఎంతో సేవ చేస్తున్నారని, ప్రభుత్వ వైద్యశాలల్లో వారి సేవ ఎంతో అత్యున్నతమైందని కొనియాడారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు మాట్లాడుతూ ల్యాబ్ టెక్నీషియన్స్ ఎంతో కీలకపాత్ర వహిస్తారని, ల్యాబ్ టెక్నీషియన్స్ డే ఘనంగా సెలబ్రేట్ చేయటం ఒక అదృష్టంగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంవో శోభారాణి, గైనకాలజిస్ట్ సుజాత, ఎనస్తీషియా డాక్టర్ కృష్ణమూర్తి, నర్సింగ్ సూపరింటెండెంట్ రాధ, మెడికల్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, ఫార్మసిస్ట్ కుమారి, జీడీఏ గోపి, శానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాస్ ఉన్నారు.

కేజీబీవీల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

క్రోసూరు: క్రోసూరులోని కేజీబీవీలో ఆరవ తరగతి, ఇంటర్ చేరేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్స్‌పాల్ సీహెచ్ ఇందిరాప్రియదర్శిని బుధవారం తెలిపారు. ఈనెల 12వ తేదీ నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించబడుతాయన్నారు. ఆరవ తరగతికి 40 సీట్లు, ఇంటర్ ప్రథమ సంవత్సరం (ఎంపీసీ) 40 సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. అనాథలు, బడి బయట పిల్లలు, డ్రాపౌట్స్, పేద, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ బాలికలు మాత్రమే అర్హులని తెలిపారు. భర్తీ కోసం హెచ్‌టీటీపీ://ఏపీకేజీబీవీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలన్నారు.

సవరణ

శ్రీరామ్‌ఫైనాన్స్ లిమిటెడ్ కొండెపాగ జాన్సన్ గారి ప్రకటనలో ఈ హద్దుల మధ్య చ.గ. 115.91 లకు సరియగు చ.మీ. 96.90 విస్తీర్ణము గల స్థలము కలదు అని చదువుకొనగలరు.

లంకా విజయ్‌కుమార్, లంకా వంశీక్రిష్ణ
న్యాయవాదులు, పెదపలకలూరు, లక్ష్మీపురం, గుంటూరు.
9030595227, 9848052914

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

(సత్తెనపల్లి, పెదకూరపాడు)
99516 02950
Office mail : sakshigntadvt@gmail.com